## మహిళలు న్యాయ సేవలు వినియోగించుకోవాలి

హసన్‌పర్తి, అక్టోబర్ 28 : మహిళలు సఖీ, న్యాయ సేవలు వినియోగించుకోవాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ క్షమదేవ్‌పాండే అన్నారు. సర్వోదయ యూత్ ఆర్గనేషన్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఎర్రగట్టుగుట్టలోని శివాని జూనియర్ కళాశాలలో సఖి వన్‌స్టాప్ సెంటర్ నిర్వహించారు. జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ, డీఎల్ఎస్ఏ సెక్రటరీ సాయికుమార్, జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ జయంతి హాజరై లైంగిక వేధింపులు, గృహ హింస, న్యాయ సేవ, వైద్యం, పోలీస్ సలహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలు సహాయం కోసం 0870-2452112 లేదా టోల్ ఫ్రీ నంబర్ 801కు ఫోన్ చేయాలని సూచించారు. కేస్ వర్కర్ హరిత పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

శాయంపేట, అక్టోబర్ 28 : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ప్రమోద్ కుమార్ అన్నారు. శాయంపేటలో పోలీసు కళాజాత బృందం సోమవారం రాత్రి బస్టాండ్ సెంటర్‌లో ప్రదర్శన నిర్వహించింది. మొబైల్ ఫోన్ల ద్వారా ఎవరికీ ఓటీపీలు చెప్పొద్దన్నారు. డ్రగ్స్, గంజాయిపై సమాచారం ఇవ్వాలని సూచించారు.

## ఇంద్రసేనారెడ్డి మృతికి బండా ప్రకాశ్ సంతాపం

న్యూశాయంపేట, అక్టోబర్ 28 : కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ ఇంద్రసేనారెడ్డి అకాల మరణంపై మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రధాన కార్యదర్శిగా, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా వారు పనిచేశారని గుర్తుచేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ట్రాఫిక్ నియంత్రణలో కేడీసీ వలంటీర్ల భాగస్వామ్యం

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 28 : హనుమకొండలోని కేడీసీ ఎన్ఎస్ఎస్ యూనిట్-3 ఆధ్వర్యంలో వలంటీర్లు ట్రాఫిక్ నియంత్రణలో ఉత్సాహంగా పాల్గొన్నారు. 'దివాళి విత్ మై భారత్' కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు జూనియర్ కాలేజీ జంక్షన్, ప్రభుత్వ మెటర్నిటీ హాస్పిటల్, మర్కజీ హైస్కూల్, ములుగురోడ్ జంక్షన్‌లో వాహనదారులకు అవగాహన కల్పించారు. కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ, కేడీసీ ప్రిన్సిపాల్ రాజారెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సురభీ వినోదర్‌రావు, సంధ్యారాణి, ఘనసింగ్, ఇన్‌స్పెక్టర్ సతీశ్, కొమురయ్య, సురేశ్, సూర్యనారాయణ, శ్రీనివాస్, నెహ్రూ యువ కేంద్రం ఆఫీసర్ చింతల అన్వేశ్, శ్రీనాథ్, శివనాగ శ్రీను పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

*I, RAMA DEVI D (Old Name), W/O. PASHIKANTI RAVINDER, R/O. H.No. 16-04-1392, Under Bridge Road, Shivanagar, Warangal. I have changed my name as PASHIKANTI RAMYA(New Name).
NTW-446

WANTED

jobs Apply Now!

*హైదరాబాద్ & తెలంగాణ జిల్లాల్లోని ప్రముఖ టెలికాం టవర్ కంపెనీలో పనిచేయడానికి డిప్లొమా/ ITI చదివిన ఎలక్ట్రీషియన్లు కావలెను. ఫోన్: 9177333978.
WGL-NT-98842

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

# ఆరోగ్య కేంద్రాల్లో కనీస ప్రమాణాలు పాటించాలి

**కలెక్టర్ ప్రావీణ్య**

హనుమకొండ : సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, అక్టోబర్ 28 : ఆరోగ్య కేంద్రాల్లో కనీస ప్రమాణాలను పాటించాలని కలెక్టర్ పీ ప్రావీణ్య ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జాతీయ నాణ్యతా ప్రమాణాల కల్పనపై పీహెచ్‌సీలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖాన, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ మెడికల్ ఆఫీసర్లతో సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రావీణ్య మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో రెండు పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఐదు పీహెచ్‌సీలకు జాతీయ నాణ్యతా ప్రమాణాలు గుర్తింపు లభించిందన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తాగునీటి సౌకర్యంతో పాటు విద్యుత్, భవనాల మరమ్మతు పనులు, టాయిలెట్స్ తదితర వసతులు కల్పించాలన్నారు. జిల్లాలోని 2 పీహెచ్‌సీలు, 2 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 3 బస్తీ దవాఖానల్లో, 10 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లు, సీహెచ్‌సీ కమలాపూర్‌ను ఈ సర్టిఫికేషన్ కోసం అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కే లలితాదేవి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయ్ కుమార్, టీఎస్ఎంఐడీసీ అధికారులు రాజశేఖర్ పాల్గొన్నారు.

**కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి**

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం కలెక్టర్ ప్రావీణ్య సందర్శించారు. సెంటర్‌లో ఏర్పాటు చేసిన మౌలిక సౌకర్యాలపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని త్వరగా కాంటాలు పెట్టి మిల్లులకు పంపించాలని సూచించారు. సెంటర్లలో టార్పాలిన్లు, తాగునీరు, ప్యాడీ క్లీనర్, కరెంటు ఏర్పాట్లను పరిశీలించారు. రైతులు ఆరబోసిన ధాన్యం తీసుకురావాలని కోరారు. సన్నరకం, 1010 దొడ్డు రకం వడ్లకు వేర్వేరుగా సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. తహసీల్దార్ సదానందం, పీఏసీఎస్ కార్యదర్శి రాజిరెడ్డి, ఏవో రాజేశ్, ఏఈవో దివ్య, సొసైటీ సిబ్బంది ఆవుల కుమారస్వామి, మురళీకృష్ణ, సెంటర్ ఇన్‌చార్జి బొడ్డు ప్రభుదేవ్, వంశీ ఉన్నారు.

## క్రిస్టియన్ సొసైటీ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తా..

**వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

ఐనవోలు, అక్టోబర్ 28 : క్రిస్టియన్ సొసైటీ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. మండలంలోని పున్నేల్ క్రాస్ సమీపంలోని మిషన్ ఇండియా క్యాంపస్‌లో నియోజవర్గ క్రిస్టియన్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రిటైర్డ్ ఐపీఎస్ బాబురావుతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. ఫెలోషిప్ అధ్యక్షుడు అశోక్‌పాల్, కార్యదర్శి రవిపాల్, కోశాధికారి మార్క్, ఉపాధ్యక్షుడు కర్ణాకర్, చైర్మన్ జన్ను హిర్మమా పాల్గొన్నారు.

## కానిస్టేబుల్‌పై కేసు నమోదు

నయీంనగర్, అక్టోబర్ 28 : కేయూ పీఎస్‌లో కానిస్టేబుల్‌పై కేసు నమోదైంది. హనుమకొండ యాదవనగర్‌కు చెందిన లింగంపల్లి కుమార్ కూతురితో హసన్‌పర్తి మండలం వంగపహాడ్ గ్రామానికి చెందిన కానిస్టేబుల్ కావటి వినయ్‌కు ఈ నెల17న వివాహం జరిగింది. రూ.20లక్షల నగదు, బంగారం ఇవ్వాలని పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకోగా రూ.లక్ష ఇచ్చారు. నిశ్చితార్థం తర్వాత తనకు కట్నం సరిపోలేదని, వేరే అమ్మాయితో ప్రేమలో ఉన్నానని చెప్పి పెళ్లికి నిరాకరించడంతో కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని బాధితులు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేశారు.

## కేయూ పీఎస్‌ను తనిఖీ చేసిన ఏసీపీ

నయీంనగర్, అక్టోబర్ 28 : కేయూ పోలీసు స్టేషన్‌ను హనుమకొండ ఏసీపీ దేవేందర్ మంగళవారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా యూనిఫార్మ్ టర్న్ అవుట్, కిట్ ఆర్టికల్స్, కేసుల వివరాలు, సిబ్బంది పని తీరుపై సీఐ రవి కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రతిభ చూపిన ముగ్గురు కానిస్టేబుళ్లకు నగదు బహుమతి అందజేశారు.

## పాత కమీషన్ విధానం అమలు చేయాలి

వరంగల్, అక్టోబర్ 28 : ఏజెంట్లకు పాత కమీషన్ విధానం అమలు చేయాలని సోమవారం ములుగురోడ్డులోని ఎల్ఐసీ కార్యాలయం ఎదుట సుమారు గంటపాటు ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు రాజ శ్రీనివాసరావు, రావుల నారాయణ మాట్లాడుతూ.. కనీస బీమాను రూ.లక్షకు తగ్గించాలని, ప్రీమియం రేట్లను సైతం తగ్గించాలని డిమాండ్ చేశారు. అన్ని పాలసీలపై కమీషన్‌తో పాటు హెల్త్ ఇన్సూరెన్స్‌ను రూ.10 లక్షలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అశోక్, కుమారస్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## దవాఖాన ఎదుట మృతదేహంతో నిరసన

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 28 : హనుమకొండలోని ఏకశిలా హాస్పిటల్‌లో దారుణం చోటు చేసుకుంది. ఠాగూర్ సినిమా తరహాలో డెడ్ బాడీకి వైద్యం చేసి రూ.7 లక్షలు డిమాండ్ చేసినట్లు బంధువులు ఆందోళనకు దిగారు. మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. వరంగల్ కరీమాబాద్‌కు చెందిన తుమ్మ అశోక్ అనారోగ్యంతో గత నెల 27న దవాఖానలో అడ్మిట్ కాగా, అప్పటి నుంచి వైద్యం చేస్తున్నట్లు నటించి డబ్బులు కడితేనే డెడ్‌బాడీ ఇస్తామని చెప్పడంతో వారి బంధువులు మృతదేహాన్ని బలవంతంగా తీసుకొని వెళ్లిపోయారు. పేద ప్రజలను దోచుకుతింటున్న ఇలాంటి ప్రైవేట్ దవాఖానపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, శ్వాస, బీపీ తక్కువ కావడం,ఏడాది పాటు బెడ్‌రీడెన్ కావడం వంటి లక్షణాలతో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో అశోక్ సోమవారం మృతి చెందినట్లు దవాఖాన చైర్మన్ కరుణాకర్ తెలిపారు. మానవతా దృక్పథంతో హాస్పిటల్ బిల్లులు చెల్లించకపోయినా 27 రోజులు ట్రీట్‌మెంట్ అందించామని, కానీ వారి బంధువులు, కరీమాబాద్‌కు చెందిన కొందరు హాస్పిటల్ సిబ్బందితో దుర్భాషలాడుతూ సెక్యూరిటీపై దౌర్జన్యం చేస్తూ మృతదేహాన్ని ఐసీయూ నుంచి తీసుకువచ్చి విషప్రచారం చేస్తున్నారని తెలిపారు. దవాఖాన యాజమాన్యం దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు, సీఐ విచారణ చేస్తున్నారని చెప్పారు.

అభివాదం చేస్తున్న అన్నికులాల సంఘాల నాయకులు

## ఈడబ్ల్యూఎస్‌ను రద్దు చేస్తే ఊరుకోం

**రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జయపాల్‌రెడ్డి**

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 28 : ఈడబ్ల్యూఎస్‌ను రద్దు చేస్తే ఊరుకోమని, మరో ఉద్యమానికి సిద్ధమవుతామని రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జయపాల్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం హనుమకొండ బ్రాహ్మణభవన్‌లో గంగు ఉపేంద్రశర్మ అధ్యక్షతన ఓసీ జాక్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జయపాల్‌రెడ్డి, కమ్మ సేవా సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి గంగవరపు శ్రీరామకృష్ణప్రసాద్, ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగేటి అశోక్, బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వెన్నెంపల్లి జగన్మోహన్‌శర్మ పాల్గొని మాట్లాడారు. అనేక రాష్ట్రాల్లో అగ్రవర్ణ పేదలకు న్యాయం జరగాలని చేసిన పోరాటాల ఫలితంగా 10 శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. రాష్ట్రంలో రెండేళ్ల సుదీర్ఘపోరాటం ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం దీన్ని అమలు చేస్తున్నదని, దీన్ని సహించలేని వారు ఈడబ్ల్యూఎస్‌ను రద్దు చేయాలని ప్రకటనలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్ కార్యాచరణ కోసం త్వరలోనే రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఓసీల కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలని, చైర్మన్‌తో పాటు పాలకవర్గాలను నియమించాలన్నారు. సమావేశంలో రాధారపు సంజీవరెడ్డి, ముదిగంటి వెంకట్‌రెడ్డి, కట్కూరి హనుమంతరెడ్డి, బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు ఏవీ సత్యమోహన్, జీవీఎస్ శ్రీనివాసాచార్యులు, ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు వంగేటి అశోక్, చకిలం రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్‌శర్మ, అర్జుల కిషన్‌రెడ్డి, రావుల నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

## 30న ధర్నా చౌక్ వద్ద నిరసన

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 28 : తెలంగాణ జిల్లాల పూలే యువ జన సంఘం, ఆలిండియా ఓబీసీ జాక్ ఆధ్వర్యంలో నిర్వహించిన జీవో 29, ఈడబ్ల్యూఎస్ రద్దు, సమగ్రకుల గణనపై జరిగిన సమావేశంలో బీసీ నాయకులు ఒకరోజు నిరసన దీక్షకు ప్రణాళిక రూపొందించారు. ఈ నెల 30న ధర్నా చౌక్ వద్ద నిరసన దీక్ష ఏర్పాటు చేసినట్లు, మద్దతుగా బీసీ సమాజమంతా కదిలి రావాలని పిలుపునిచ్చారు. హనుమకొండ కుమార్‌పల్లిలోని లయోల హైస్కూల్‌లో తాడిశెట్టి క్రాంతికుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆలిండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, గౌడ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బొనగని యాదగిరిగౌడ్, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యామ్‌యాదవ్, యాదవ మహాసభ జిల్లా నాయకుడు జల్లల కృష్ణమూర్తి, గొల్లపల్లి వీరస్వామి, రవికుమార్ పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

**పశ్చిమ నియోజవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే నాయిని సమీక్ష**

మేయర్‌తో కలిసి సమీక్షిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్, అక్టోబర్ 28 : పశ్చిమ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కుడా కార్యాలయంలో ఆయన మేయర్ సుధారాణి, కలెక్టర్ ప్రావీణ్య, గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడేతో కలిసి సమీక్ష నిర్వహించారు. భద్రకాళీ బండ్ పనులు చివరి దశకు చేరుకున్నాయని, బొంది వాగు నాలా విస్తరణ పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులు తెలిపారు. పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. పబ్లిక్ గార్డెన్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన శంఖు చుట్టూ వాహనాలు నిలుపకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. డివిజన్లలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న జవాన్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాలసముద్రం, కాజీపేటతో పాటు పలు ప్రధాన కూడళ్లలో చిరు వ్యాపారులు రోడ్లపై వ్యాపారాలు చేయడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని, వెండర్స్ జోన్లలో వ్యాపారాలు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాజీపేట, సోమిడి, గోపాలపురం ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉందని వెంటనే పరిష్కరించాలన్నారు. కాళోజీ కళాక్షేత్రానికి మూడు భాషల్లో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. గోకుల్ జంక్షన్, డబ్బాల వద్ద రోడ్డు వెడల్పు చేయాలన్నారు. సమావేశంలో బల్దియా ఎస్ఈలు ప్రవీణ్ చంద్ర, రాజయ్య, డీఈ సంతోష్ బాబు, సారంగం, కుడా పీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీమ్‌రావు, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీంద్ర రాధేకర్ పాల్గొన్నారు.

**మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మవిశ్వాసం పెంపు**

న్యూశాయంపేట : మార్షల్ ఆర్ట్స్ శిక్షణతో శారీరక దృఢత్వమే కాకుండా మానసికంగా ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. విక్టరీ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఫాతిమానగర్, దర్గా, పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో రాష్ట్రస్థాయి కరాటే పోటీలు జరిగాయి. స్పారింగ్ విభాగంలో శ్రీహాన్, అబ్దుల్, విరాజ్, జయ్యద్, లక్ష్మి, రోహిత, విహాన్, సుహాన్, టియాజ్ పతకాలు సాధించారు.

# గ్రీవెన్స్ వినతుల పరిష్కారంలో జాప్యం తగదు

**గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే**

వరంగల్, అక్టోబర్ 28 : బల్దియా గ్రీవెన్స్ వినతులు, ఫిర్యాదులు పరిష్కరించడంలో జాప్యం తగదని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. సోమవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కమిషనర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కాశీబుగ్గ మాధురీ నగర్ రోడ్ నంబర్-3లో రోడ్డు, డ్రైనేజీలు లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. 3వ డివిజన్ ఆరెపల్లిలో బీరన్న ఆలయ భూమిని ఆక్రమించి కొమ్ము సురేందర్, మహేందర్ ఇంటిని నిర్మిస్తున్నారని కురుమ కుల స్తులు ఫిర్యాదు చేశారు. 13వ డివిజన్ దేశాయిపేట నజరత్‌పురాలో సీసీ రోడ్డు, డ్రైనేజీలు నిర్మించాలని స్థానికులు వినతిపత్రం అందజేశారు. పోతన బైపాస్ రోడ్డులోని కిరోసిన్ డీలర్స్ అసోసియేషన్‌కు చెందిన స్థలంలో అక్రమ నిర్మాణం చేస్తున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని సభ్యులు ఫిర్యాదు చేశారు. గ్రీవెన్స్‌లో 77 వినతులు వచ్చాయి. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 42, ఇంజినీరింగ్ విభాగం 17, ప్రజారోగ్య విభాగం 10, పన్నుల విభాగం 7, తాగునీటి సరఫరాపై 2 వినతులు వచ్చాయి. అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, సీఎంహెచ్‌వో రాజిరెడ్డి, ఎంహెచ్‌వో రాజేశ్, ఇన్‌చార్జి సీపీ రవీంద్ర రాధేకర్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, హెచ్‌వో రమేశ్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి పాల్గొన్నారు.

**ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో వేగం పెంచాలి**

గ్రేటర్‌లో పెద్ద ఎత్తున పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్లియర్ చేసేందుకు క్షేత్రస్థాయి పరిశీలనలో వేగం పెంచాలని బల్దియా కమిషనర్ అన్నారు. కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో టీపీఎస్‌లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టీపీఎస్‌లు తమ పరిధిలోని వార్డు అధికారులను సమన్వయం చేసుకొని ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలించాలన్నారు. అనుకున్న గడువులోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్ఈ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

# క్రీడల్లో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలి

- ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అజీజ్‌ఖాన్
- జేఎన్ఎస్‌లో కొనసాగుతున్న అండర్-19 జూనియర్ కళాశాలల క్రీడాపోటీలు

కార్యక్రమంలో మాట్లాడుతున్న అజీజ్‌ఖాన్

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 28 : విద్యార్థులు క్రీడల్లో రాణించి జిల్లాకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్ అన్నారు. హనుమకొండ జేఎన్ఎస్‌లో అండర్-19 జూనియర్ కళాశాలల క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. సోమవారం హనుమకొండ డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడాకాలకు నిలయం వరంగల్ అని అన్నారు. అశోక్‌కుమార్ మాట్లాడుతూ హ్యాండ్‌బాల్, బ్యాడ్మింటన్, ఉషు, టెన్నీకాయిట్, సాఫ్ట్ టెన్నిస్, మాల్కంబ్, సెపక్‌తక్రా క్రీడాంశాల్లో పోటీలను నిర్వహించామని తెలిపారు. పోటీలకు ఉమ్మడి జిల్లాలోని జూనియర్ కళాశాల నుంచి వెయ్యిమంది క్రీడాకారులు హాజరయ్యారని, మంగళవారం సైక్లింగ్, పవర్ లిఫ్టింగ్, బీచ్ వాలీబాల్, షూటింగ్, స్కేటింగ్, బేస్‌బాల్, రగ్బీ, యోగా, కృష్, స్క్వాష్ పోటీలు ఉంటాయని తెలిపారు. అలాగే, బ్యాడ్మింటన్ పోటీలను ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ రమేశ్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సృజన్‌కుమార్, పీడీలు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, వాసు, అశోక్ పాల్గొన్నారు.

# సమస్యలతో వచ్చాం.. పరిష్కరించండి

- కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు ప్రజల నుంచి 104 అర్జీలు
- స్వీకరించిన అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి


విజ్ఞప్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ఏ వెంకట్‌రెడ్డి

హనుమకొండ, అక్టోబర్ 28 : సమస్యలతో వచ్చాం.. పరిష్కరించాలని సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు మొరపెట్టుకున్నారు. అర్జీలు ఇస్తున్నామే కానీ సమస్యలు పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌వో వైవీ గణేశ్ విజ్ఞప్తులు స్వీకరించారు. సమస్యలను పరిష్కరించి బాధితులకు సమాచారం అందించాలని ఆదేశించారు. ఇందులో రెవెన్యూ, జీడబ్ల్యూఎంసీ సమస్యలకు సంబంధించి ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో రెవెన్యూ సమస్యలు 55, జీడబ్ల్యూఈఎంసీవి 16కాగా, మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి ఉన్నాయి. మొత్తంగా గ్రీవెన్స్‌లో 104 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. అంబేద్కర్‌నగరంలో కట్టిన డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇప్పించాలని నగరంలోని 31వ డివిజన్ అంబేద్కర్ నగర్ బస్తీ వాసులు యెర్ర చంద్రమౌళి, స్వామి, రఘు, రాజు, నర్సింగం, హుస్సేన్ వినతి పత్రం అందజేశారు.

**గురుకుల భవనాన్ని మార్చాలి..**

శిథిలావస్థలో ఉన్న గురుకుల భవనాన్ని మార్చాలని లేదా సొంత భవనం నిర్మించాలని కోరుతూ డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. హంటర్ రోడ్డులో నిర్వహిస్తున్న గురుకుల డిగ్రీ కాలేజ్ అద్దె భవనం చాలా ఏళ్ల క్రితం నిర్మించారని, పైకప్పు పెచ్చులూడి విద్యార్థినులపై పడడంతో గాయాలయ్యాయన్నారు. పర్మినెంట్ లెక్చరర్స్ ఉన్నా ల్యాబ్స్ నిర్వహించడం లేదని, విద్యార్థులు నష్టపోతున్నారని తెలిపారు.

**నా పేరుపై భూమిని మార్చాలి..**

నా కొడుకు పేరుపై ఉన్న భూమిని నా పేరుపై మార్చాలి. నా భర్త అనుముల లింగారెడ్డి ఐదు నెలల క్రితం చనిపోయిండు. దామెర మండలం ముస్త్యాలపల్లి శివారులో నా భర్త పేరుపై 2.33ఎకరాల భూమి ఉండేది. నా కొడుకు నన్ను అనేక ఇబ్బందులకు గురి చేసి నాతో సంతకం చేయించుకొని ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకొన్నాడు. నన్ను ఇంటి నుంచి వెళ్లగొట్టి చంపుతానని బెదిరిస్తున్నాడు. నా ఆధార్ కార్డు కూడా గుంజుకున్నాడు. ప్రస్తుతం నా చిన్న కుమార్తె ఇంట్లో ఉంటున్నాను. నాకు న్యాయం చేయాలని మొర పెట్టుకొంది.

– అనుముల రాధమ్మ, అక్కంపేట, ఆత్మకూరు

**న్యాయం చేయండి..**

నా భర్త పోలీసు కానిస్టేబుల్. డ్యూటీపై ములుగు వెళ్తున్న క్రమంలో నక్సలైట్లు అమర్చిన మందుపాతర పేలి మరణించాడు. ప్రభుత్వ నిబంధనల మేరకు నాకు కాజీపేట జాగీర్ శివారు రామకృష్ణ కాలనీలోని సర్వే నంబర్ 27లో 300 గజాల స్థలానికి కలెక్టర్ ఉత్తర్వుల మేరకు రెవెన్యూ అధికారులు 2011లో పట్టా ఇచ్చారు. అందులో రూం, ప్రహరీ నిర్మించుకున్నాను. 13 సంవత్సరాల తర్వాత ఆగస్టు 8న ఆ స్థలం ఎఫ్‌టీఎల్‌లో ఉందని రూం, ప్రహరీ కూల్చివేశారు. 